ఘనంగా బంగారు మైసమ్మ కల్యాణ మహోత్సవం



చీర, పుస్తే, మెట్టెలు అందజేస్తున్న శ్రీనివాస్ గుప్తా దంపతులు

నాగోలు: నువ్వులబండలోని బంగారు మైసమ్మ దేవాలయంలో ఆదివారం నిర్వహించిన అమ్మవారి కల్యాణంలో టీపీసీసీ ప్రచార కమిటీ రాష్ట్ర కోకన్వీనర్ ఉప్పల శ్రీనివాస్ గుప్తా దంపతులు పాల్గొని అమ్మవారికి ఒడిబియ్యం పోసి పుస్తె, మెట్టెలు, చీర గాజులు అందజేశారు. ఈ సందర్భగా శ్రీనివాస్ గుప్తా మాట్లాడుతూ.. బంగారు మైసమ్మ తల్లి ఆశీస్సులతో అందరూ సంతోషంగా ఉండాలని ఆకాంక్షించారు. దేవాలయాల అభివృద్ధికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో కాంగ్రెస్ ప్రభుత్వం అన్ని విధాలా కృషి చేస్తుందని పేర్కొన్నారు.

ఇక్కడ వృథా..

సైదాబాద్, ఐఎస్‌సదన్ డివిజన్ల పరిధిలోని పలు కాలనీలు, బస్తీల్లో తాగునీరు వృథా అవుతున్నా పట్టించుకునే నాథులే లేరని ఆయా ప్రాంతాల వారు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికీ ఎన్నో బస్తీలు, మురికివాడల ప్రజలు జలమండలి సరఫరా చేసే ట్యాంకర్లపైనే ఆధారపడి జీవిస్తున్నాయి. అలాంటిది నేరుగా పైపులైన్ల ద్వారా ఇళ్లకు వచ్చే తాగునీటిని పలువరు విచ్చలవిడిగా వదిలేస్తున్నారు. సైదాబాద్ హౌజింగ్ బోర్డ్ కాలనీలో నల్లా ద్వారా నీరు వచ్చే రోజు కాలనీలోని రహదారులన్నీ తాగునీటితో నిండిపోతున్నాయి. తాగునీటితో తమ వాహనాలను శుభ్రం చేసుకునే వారు కొందరైతే, పైపు ద్వారా నీటిని రహదారులపై వదిలేసే వారు మరి కొందరు. ఇలా నల్లా వచ్చే రోజు పలువురి నిర్లక్ష్యం కారణంగా తాగునీరు వృథాగా పోతుంది. తమ కాలనీలో నీటి వృథా గురించి వాటర్‌వర్క్స్ అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని కాలనీవాసులు ఆరోపిస్తున్నారు.

– సైదాబాద్





సైదాబాద్ హౌజింగ్ బోర్డ్ కాలనీలో రహదారిపై పారుతున్న తాగునీరు



తాగునీటి కోసం బయట ఉంచిన డ్రమ్ములు

అక్కడ వృథ

వేసవి వచ్చిందంటే మలక్‌పేట్‌జోన్ పరిధిలోని చాలా కాలనీలు, బస్తీల్లో నీటి ఎద్దడితో నానా ఇక్కట్లకు గురవుతుంటారు. ఆర్‌కేపురం, సరూర్‌నగర్ డివిజన్ల పరిధిల్లోని బస్తీల్లో వివిధ జిల్లాల నుంచి బతుకు దెరువు కోసం నగరానికి వలసొచ్చి ఇక్కడే స్థిర నివాసం ఏర్పర్చుకుని జీవిస్తున్నారు. వేలాది కుటుంబాలు నివసించే ఎన్‌టీఆర్‌నగర్, భగత్‌సింగ్‌నగర్, అంబేడ్కర్ కాలనీ, సింగరేణికాలనీల్లో ఎక్కువ శాతం కూలీ పనులు చేసుకుంటేనే పూట గడుస్తుంది. అంతటి క్లిష్ట పరిస్థితుల్లోనూ తాగునీటి కోసం వారు పనులు మానుకొని వాటర్ ట్యాంకర్ల కోసం ఎదురు చూడాల్సి వస్తుంది. మరి కొందరు తల్లిదండ్రులు రోజువారీ పనులకు వెళ్తే తప్పనిసరి పరిస్థితుల్లో వారి పిల్లలు పాఠశాలకు వెళ్లటం మానేసి తాగునీరు పట్టుకోవడానికి ఇంటి వద్దనే ఉండాల్సిన దుస్థితి నెలకొంది.

– దిల్‌సుఖ్‌నగర్

ఘనంగా మట్టల ఆదివారం



మట్టలతో ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

మలక్‌పేట: గుడ్ ఫ్రైడేకు ముందుగా వచ్చే ఆదివారన్ని క్రైస్తవులు మట్టల ఆదివారంగా ప్రత్యేక ఆరాధనలు జరుపుకుంటారు. దిల్‌సుఖ్‌నగర్ బాప్టిస్ట్ చర్చిలో మట్టల ఆదివారం ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. చిన్న పిల్లలు మల్లె పూలతో అలంకరించిన ఈత మట్టలు పట్టుకొని పుర వీధుల్లో కీర్తనలతో ర్యాలీ చేపట్టారు. చర్చి పాస్టర్ రెవరెండ్ డా. బోడ సాల్మన్ బైబిల్ లోని లేఖనాలు బోధించి, ప్రార్థనలు చేశారు. రెవరెండ్ కే. శాంత్ కుమార్, చర్చి కమిటీ అధ్యక్షులు వేమూరి లూకానంద్ రావు, సండే స్కూల్ సూపరింటెండెంట్ బ్యాల శ్రీధర్, చర్చి పెద్దలు, సండే స్కూల్ టీచర్స్, పాల్గొన్నారు.

దిగ్విజయంగా సంపూర్ణ శతావధానం



నాంపల్లి: డాక్టర్ మారేపల్లి వెంకటరమణ పటవ్రర్ధన్ సంపూర్ణ శతావధానం రెండో రోజు నాంపల్లిలోని డాక్టర్ నందమూరి తారక రామారావు కళా మందిరంలో దిగ్విజయంగా కొనసాగింది. తెలుగు విశ్వవిద్యాలయం, ప్రజా–పద్యం, అవధాన విద్యా వికాస పరిషత్ సంస్థల సంయుక్త నిర్వహణలో నడుస్తున్న శతావధాన కార్యక్రమంలో రెండో రోజు మొదటి సమావేశం డాక్టర్ సంగనభట్ల నర్సయ్య అధ్యక్షతన ప్రారంభమైంది. ప్రముఖ శతావధాని డాక్టర్ ఆముదాల మురళి సంచాలకత్వ బాధ్యత వహించారు. శతావధానంలో 25 సమస్యలు, 15 వర్ణనల పూరణలు, ఐదు అశువులు పూరించడం జరిగింది. మధ్యాహ్నం జరిగిన సమావేశానికి ప్రముఖ జాతీయ కవి డాక్టర్ కసిరెడ్డి వెంకటరెడ్డి అధ్యక్షత వహించగా తన శిష్యుడైన అవధానిని ఆశీర్వదించారు. రెండో సమావేశంలో 25 దత్తపదులు, రెండు, మూడు పాదాలు, ఐదు నిషేధాక్షరులు, ఐదు న్యస్తాక్షరులు, రెండో పాదం పూరణ, ఐదు అశవుల పూరణ చేశారు. తెలుగు విశ్వవిద్యాలయం ఉపాధ్యక్షుడు ఆచార్య వెలుదండ నిత్యానందరావు, అవధాన కార్యక్రమ అధ్యక్ష, కార్యదర్శులు నారుమంచి అనంతకృష్ణ శర్మ, డాక్టర్ మరుమాముల దత్తాత్రేయ శర్మ, సభా సంచాలకులు అవుసు భాను ప్రకాష్, అతిథి సత్కార నిర్వాహకులు, కోశాధికారి కేవీఎస్ ఆచార్య సభా కార్యాన్ని సంపన్నంగా నిర్వహింపజేశారు.

మహిళా బిల్లులో బీసీ మహిళలకు సబ్ కోటా కల్పించాలి

కాచిగూడ: మహిళా బిల్లులో బీసీ మహిళలకు సబ్ కోటా కల్పించాలని ఓబీసీ డెమోక్రటిక్ జేఏసీ చైర్మన్ కోల జనార్దన్ కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కాచిగూడలో గుజ్జ కృష్ణ అధ్యక్షతన ఓబీసీ డెమోక్రటిక్ జేఏసీ ప్రతినిధుల సమావేశం ఆదివారం జరిగింది. ఈ సందర్భంగా ఓబీసీ డెమోక్రటిక్ మహిళా జేఏసీ చైర్‌పర్సన్‌గా గోగులమండ స్వరూప ఎంపిక కాగా, ఆమెకు కోల జనార్దన్ నియామక పత్రాన్ని అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. బీసీ బిల్లులను కేంద్ర ప్రభుత్వం వెంటనే పార్లమెంట్‌లో ప్రవేశపెట్టి ఆమోదించి 9వ షెడ్యూల్‌లో చేర్చాలని డిమాండ్ చేశారు. మహిళా బిల్లులో బీసీ మహిళలకు రాజకీయ రిజర్వేషన్లు కల్పించే వరకు దేశవ్యాప్తంగా ఉద్యమం కొనసాగిస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో జాతీయ బీసీ సంక్షేమ సంఘం కార్యదర్శి పగడాల సుధాకర్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తంగెళ్లమూడి నందగోపాల్, మీనగ గోపి, ఉదయ్ నేత తదితరులు పాల్గొన్నారు.

ఒకే వేదికపై మూడు దివ్యాంగ జంటలకు పెళ్లి



దివ్యాంగ జంటలతో జగిని శ్రీనివాస్, అనిల్ కుమార్

సైదాబాద్: అనాథ దివ్యాంగులకు పెళ్లిళ్లు జరిపించడం ఎంతో సంతోషంగా ఉందని జగిని ఫర్నిచర్స్ అధినేత జగిని శ్రీనివాస్ అన్నారు. ఆదివారం సైదాబాద్ ఎస్‌బీహెచ్ కాలనీలోని శ్రీనివాస కమ్యూనిటీ హాల్లో మూడు జంటలకు పెళ్లిళ్లు నిర్వహించారు. జగిని ఫర్నిచర్, రూపాయి ఫౌండేషన్ చైర్మన్ అనిల్ కుమార్, యడవల్లి బాలరాజు, కేవీ ప్రసాద్, రామ్ సేవా సమితి ట్రస్ట్ సభ్యుల ఆధ్వర్యంలో ఒకే వేదికపై మూడు పెళ్లిళ్లు జరిపించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కులమతాలకు అతీతంగా తమ వద్దకు వచ్చే ఆర్థికంగా వెనుకబడిన నిరుపేదలు, దివ్యాంగులకు తాము ఎల్లప్పుడు అండగా నిలుస్తామన్నారు. ఈ కార్యక్రమంలో రామ్ సేవా సమితి అధ్యక్షుడు నర్సింహారావు, సభ్యులు నీల వెంకటేష్, శ్రీరాములు, సురేష్, వినోద్, ఉప్పల వెంకటేష్, నాంపల్లి శ్రీనివాస్ పాల్గొన్నారు.

శ్రీపాదరావు సేవలు మరువలేనివి



శ్రీపాదరావు చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న నాయకులు

నాగోలు: నిరంతరం ప్రజల మనిషిగా ఉంటూ పేద బడుగు బలహీన వర్గాల అభివృద్ధి కోసం పని చేసిన ఉమ్మడి ఏపీ స్పీకర్ సేవలు మరువలేనివని తెలంగాణ బ్రాహ్మణ సేవా సమితి రాష్ట్ర అధ్యక్షులు పోచంపల్లి రమణారావు అన్నారు. కొత్తపేట డివిజన్ మోహన్‌నగర్‌లో ఆదివారం నిర్వహించిన దివంగత దుద్దిల్ల శ్రీపాద రావు వర్ధంతిలో రమణారావు పాల్గొని నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. శ్రీపాదరావు గ్రామ సర్పంచ్ స్థాయి నుంచి కోఆపరేటివ్ జిల్లా చైర్మన్‌గా సమితి అధ్యక్షుడిగా ఎమ్మెల్యేగా ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ స్పీకర్‌గా ఉన్నతమైన పదవులను నిర్వర్తించారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ బ్రాహ్మణసేవా సమితి రాష్ట్ర ఉపాధ్యక్షుడు దేవులపల్లి రంగారావు, రాష్ట్ర కోశాధికారి మంత్రి సునీల్, రంగారెడ్డి జిల్లా అధ్యక్షులు దేవులపల్లి బాలచందర్ శర్మ, గూడా రాజేశ్వరరావు, ఎన్ రఘు, దేవులపల్లి అశోక్ కుమార్ పాల్గొన్నారు.

రామయ్య కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలి

చంపాపేట: ప్రభుత్వ అటవీ భూమిలో కోటి మొక్కలను నాటి వాటిన సంరక్షణ బాధ్యతలు చేపట్టి వనజీవి హరితహార రామయ్యగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు గుర్తించిన కుమ్మరి కులానికి చెందిన దివంగత దరపల్లి రామయ్య కుటుంబ సభ్యులను ప్రభుత్వమే ఆదుకోవాలని రాష్ట్ర కుమ్మరి సంఘ ప్రధాన కార్యదర్శి మల్కాజిగిరి దయానంద్ డిమాండ్ చేశాడు. ఆదివారం చంపాపేటలోని అనంద్ ఫంక్షన్ హాల్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ఆయన హాజరై సంఘ అధ్యక్షుడు నడికుడి జయంత్‌రావుతో కలిసి రామయ్య చిత్రపటానికి నివాళులర్పించారు. ఈ సందర్భంగా దయానంద్ మాట్లాడుతూ...వనజీవి రామయ్య సేవలను గుర్తించి ట్రైబల్ యూనివర్సిటీకి రామయ్య యూనివర్సిగా పేరు పెట్టాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎగిరశెట్టి వీరయ్య, బాల్‌రాజ్, సుభాష్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మల్కాజిగిరి దయానంద్

ఎంపీ ఈటలకు వినతి



ఈటలకు వినతిపత్రం ఇస్తున్న బీజేపీ నాయకులు

నాగోలు: బండ్లగూడ బస్సుడిపో సమీపంలోని మహావీర్ హరిణి వనస్థలి నేషనల్ పార్క్ రెండో గేట్‌ను మళ్లీ తెరిపించాలని బీజేపీ సీనియర్ నాయకులు చరణ్‌రెడ్డి, నాగోలు డివిజన్ అధ్యక్షుడు పంగా శ్రీకాంత్ ఆదివారం మల్కాజ్‌గిరి ఎంపీ ఈటల రాజేందర్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కోవిడ్ సమయంలో ఈ గేట్ మూసేసి ఇప్పటి వరకూ తెరవలేదన్నారు. మొదటి గేట్ నుంచి రెండో గేట్ వరకు ట్రాక్ 3 కిలో మీటర్లు ఉంటుందని రెండో గేట్ మూసి వేయడంతో సమీప కాలనీ వాసులు వృద్ధులు ఫతుల్లాగూడలోని 120 అడుగుల రోడ్డుపై నడవాల్సి వస్తోందన్నారు. రెండో గేట్ తెరిచేలా చొరవ చూపాలని వినతిలో కోరారు. ఎంపీని కలిసిన వారిలో చంద్రశేఖర్, తరల్ శర్మ, చంద్రశేఖర్ గుప్తా ఉన్నారు.

ఆలయ విస్తరణకు భూమిపూజ

బోడుప్పల్: పెంటారెడ్డి కాలనీలోని మాతా నిమిషాంబదేవి అమ్మవారి ఆలయాన్ని మరింత అభివృద్ధి చేసేందుకు ఆలయ చైర్మన్ వినోద్‌కుమార్, బీసీ కమిషన్ ప్రత్యేక చైర్మన్ వేంకటేశ్వరరావు భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. భక్తులకు మెరుగైన సౌకర్యాల కల్పనకు అందుబాటులో ఉన్న స్థలంలో ఆలయాన్ని మరింత విస్తరింపజేస్తున్నామన్నారు. రాష్ట్ర నకాష్ సంఘం అధ్యక్షుడు రాచర్ల కేశవ్‌రావు, అసోసియేట్ అధ్యక్షుడు అశోక్‌కుమార్, ప్రధాన కార్యదర్శి కొరిచర్ల శ్రీనివాస్‌రావు తదితరులున్నారు.

ఉచిత వైద్య శిబిరం

బోడుప్పల్: పేద, మధ్యతరగతి ప్రజలకు మరిన్ని వైద్యసేవలు అందాలని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు గుర్రాల వెంకటేష్‌యాదవ్ అన్నారు. జ్యోతినగర్ కాలనీలో ఆదివారం మెడిస్టార్ హాస్పిటల్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత మెగా వైద్య శిబిరానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ పేద, మధ్యతరగతి ప్రజలకు మెరుగైన వైద్యసేవలు అందిస్తుందని, వాటితో పాటు మరిన్ని సేవలు అందించాలన్నారు. హరి, జైపాల్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి, వెంకటేష్‌గౌడ్ పాల్గొన్నారు.

సేవా కార్యక్రమాల్లో ముందుండాలి

బోడుప్పల్: సేవా కార్యక్రమాల్లో నాయకులు, కార్యకర్తలు ముందుండాలని బోడుప్పల్ బీఆర్‌ఎస్ పార్టీ అధ్యక్షుడు మంద సంజీవ్‌రెడ్డి అన్నారు. బోడుప్పల్ 15వ డివిజన్‌లో సూరజ్‌నగర్ కమాన్ వద్ద సీఆర్‌ఆర్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ప్రజలకు దాహార్తిని తీర్చడంలో ట్రస్ట్ నిర్వాహకులు ముందుండారన్నారు. డివిజన్‌లో అనేక సేవా కార్యక్రమాలు చేపడుతూ తన ఉదారతను చాటుకుంటున్నారన్నారు. బొల్లిగూడ చౌరస్తా, అమ్మసాని వెంకట్‌రెడ్డి చౌరస్తా వద్ద చలివేంద్రాలను ఏర్పాటు చేసి వేసవిదాహాన్ని తీరుస్తున్నారన్నారు.

వినతి

ఉప్పల్/రామంతాపూర్: నియోజకవర్గంలో చేపట్టాల్సిన అభివృద్ధి పనులకు నిధులు కేటాయించాలని ఉప్పల్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి మందముల పరమేశ్వర్‌రెడ్డి సీఎం రేవంత్‌రెడ్డిని కోరారు. నియోజకవర్గంలో చెరువుల అభివృద్ధి సుందరీకరణ పనులతో పాటు భూగర్భ డ్రైనేజీ వ్యవస్థను మెరుగుపరచడానికి నిధులు మంజూరు చేయాలని వినతిపత్రం అందజేశారు.

నూతన ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు



ట్రాన్స్‌ఫార్మర్ ప్రారంభోత్సవంలో వెంకటేశ్వర్‌రెడ్డి

వనస్థలిపురం: క్రిస్టియన్ కాలనీలోని సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని వనస్థలిపురం కార్పొరేటర్ రాగుల వెంకటేశ్వర్‌రెడ్డి అన్నారు. కాలనీలో నూతనంగా ఏర్పాటు చేసిన విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ను ఆదివారం ఆయన ప్రారంభించి మాట్లాడారు. కాలనీలో నెలకొన్న ఇతర సమస్యలను త్వరితగతిన పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కాలనీ అధ్యక్షుడు హరినాథ్‌రెడ్డి, కృష్ణయ్య, మోహన్ రెడ్డి పాల్గొన్నారు.

బీజేపీ బలోపేతానికి కృషి చేయాలి



జెండాను ఆవిష్కరిస్తున్న వనపల్లి శ్రీనివాసరెడ్డి

చైతన్యపురి: వాజ్‌పేయి, అద్వానీ వంటి నాటి తరం నాయకుల స్ఫూర్తితో పార్టీని ముందుకు తీసుకెళ్లేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని రంగారెడ్డి జిల్లా బీజేపీ అధ్యక్షుడు వనపల్లి శ్రీనివాస రెడ్డి అన్నారు. మాజీ ప్రధాని అటల్ బిహారీ వాజ్‌పేయి శత జయంతి ఉత్సవాల్లో భాగంగా చైతన్యపురి బీజేపీ అధ్యక్షుడు బత్తుల సుమన్‌గౌడ్ ఆధ్వర్యంలో చైతన్యపురి న్యూదిల్‌సుఖ్‌నగర్ కాలనీలో జరిగిన కార్యక్రమంలో ఆయన పాల్గొని జెండాను ఆవిష్కరించారు. కార్యక్రమంలో శ్రీకాంత్, రాణి రుద్రమ, కృష్ణప్రకాష్, పర్లశివ, మహేష్, వెంకటేష్, సత్యం పాల్గొన్నారు.

రైతు బజార్‌లలో కూరగాయల ధరలు

దిల్‌సుఖ్‌నగర్: సరూర్‌నగర్/వనస్థలిపురం రైతు బజార్‌లలో కూరగాయల ధరల వివరాలు టమాటా రూ.15, వంకాయ రూ.18, బెండ రూ.40, పచ్చిమిర్చి రూ.40, కాకరకాయ రూ.35, బీరకాయ రూ.40, కాలిఫ్లవర్ రూ.18, క్యాబేజీ రూ.08, క్యారెట్ రూ.19, దొండ రూ.18, ఆలుగడ్డ రూ.25, ఉల్లిగడ్డ రూ.19, గోకరకాయ రూ.40, దోసకాయ రూ.18, సొరకాయ రూ.09, పొట్లకాయ రూ.18, అరటికాయ రూ.10, చిక్కుడుకాయ రూ.55, చామగడ్డ రూ.35, మునగ రూ.23, కందగడ్డ రూ.85, బీట్‌రూట్ రూ.15, కీర రూ.25, బీన్స్ రూ.65, క్యాప్సికమ్ రూ.40. ఈ ధరలు సోమవారం ఉదయం 9 గంటల వరకు వర్తిస్తాయి.

నేడు అంబేడ్కర్ జయంతి

మన్సూరాబాద్: డా.బీఆర్.అంబేడ్కర్, బాబూ జగ్జీవన్‌రామ్ ఎల్‌బీనగర్ ఉత్సవాల కమిటీ కన్వీనర్ ఆడాల రమేష్, కొంగరి నర్సింహారావు ఆధ్వర్యంలో ఎల్‌బీనగర్‌లోని అంబేడ్కర్ విగ్రహం వద్ద సోమవారం అంబేడ్కర్ జయంతి వేడుకలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అనంతరం మెగా రక్తదాన శిబిరాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు పేర్కొన్నారు. జయంతి వేడుకలకు ఎల్‌బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి, టీపీసీసీ ప్రచార కమిటీ చైర్మన్ మధుయాష్కి, బీజేపీ రంగారెడ్డి అర్బన్ జిల్లా మాజీ అధ్యక్షుడు సామ రంగారెడ్డి హాజరవుతారన్నారు.

ఎల్‌బీనగర్ నుంచి పాదయాత్ర..

నాగోలు: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ జయంతి ఉత్సవాల సందర్భంగా కామన్ మ్యాన్ ఫోరం ఫర్ సోషల్ జస్టిస్ ఫౌండర్ ప్రెసిడెంట్ సంగటి ప్రసాద్ ఆధ్వర్యంలో సోమవారం ఎల్‌బీనగర్ అంబేడ్కర్ విగ్రహం నుంచి కొత్తపేట చౌరస్తా వరకు పాదయాత్ర ఉంటుందని నిర్వాహకులు ఓ ప్రకటనలో తెలిపారు. పాదయాత్ర అనంతరం అంబేడ్కర్ జయంతి ఉత్సవాలు ఉంటాయన్నారు.

ఓపెన్ జిమ్‌ను సద్వినియోగం చేసుకోవాలి



ఓపెన్ జిమ్‌ను ప్రారంభిస్తున్న పవన్‌కుమార్

నాగోలు: ఆరోగ్య పరిరక్షణ కోసం అందరూ నిత్యం వ్యాయామం చేయాలని కొత్తపేట కార్పొరేటర్ నాయికోటి పవన్‌కుమార్ అన్నారు. మానస ఎంక్లేవ్ కాలనీలో నూతనంగా ఏర్పాటు చేసిన ఓపెన్‌జిమ్‌ను ఆదివారం కార్పొరేటర్ ప్రారంభించి మాట్లాడారు. కాలనీవాసులంతా ఓపెన్ జిమ్‌ను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో కాలనీ అధ్యక్షుడు జహీర్‌ఖాన్, వెంకట్ రామయ్య, నవీన్, వెంకటేశ్వర్లు, అంజనీ, వసంత, దుర్గా, లక్ష్మీ, నాయకులు మంచి రాజేష్, జంగా రెడ్డి, సుందర్ నారాయణ, కొత్త తిరుమల, రాకేష్ యాదవ్ పాల్గొన్నారు.

కొత్తపేటలో వైష్ణవి చైతన్య సందడి



ఆభరణాలు ఆవిష్కరిస్తున్న వైష్ణవిచైతన్య

దిల్‌సుఖ్‌నగర్: కొత్తపేటలోని విశిష్ట గోల్డ్ అండ్ డైమండ్స్ సంస్థ రెండో బ్రాంచ్‌ను ఆదివారం సినీ నటి వైష్ణవి చైతన్య ప్రారంభించారు. ఈ సందర్భంగా విశిష్ట సీఈఓ సింధూజ, ఎండీ ఆనంద్ మాట్లాడుతూ.. వ్యాపారంతో పాటు కొనుగోలుదారులకు నాణ్యమైన ఆభరణాలు అందించి, వారి విశ్వాసాన్ని పొందడం తమ బాధ్యత అన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి, ఎమ్మెల్సీ దయానంద్ గుప్తా, పర్యాటకాభివృద్ధి సంస్థ మాజీ చైర్మన్ ఉప్పల శ్రీనివాస్‌గుప్తా, ఆర్‌కేపురం కార్పొరేటర్ రాధా ధీరజ్ రెడ్డి, సంస్థ ప్రతినిధులు పాండురంగం, శివ, సతీష్, సుమంత్, ఎల్‌వీ కుమార్, సాయి, మనీష్, శ్రీదేవి పాల్గొన్నారు.

సదానంద గుప్తా సేవలు అమోఘం

అబిడ్స్: సదానందగుప్తా సేవలు అమోఘమని గోషామహల్ ఎమ్మెల్యే రాజాసింగ్ పేర్కొన్నారు. సంవత్సరం పొడవునా నిరంతరం పలు సేవా కార్యక్రమాలు చేపడుతూ సదానందగుప్తా గొప్ప సమాజ సేవకుడిగా నిలిచిపోయారన్నారు. ఆదివారం సమాజ సేవకులను రాజాసింగ్ ఘనంగా సత్కారం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..30 ఏళ్లుగా ధూల్‌పేట రహీంపురాలో ఉంటున్న సదానందగుప్తా (నందం) నిత్యం సేవా కార్యక్రమాలు చేపడుతూ సమాజ శ్రేయస్సుకు, సమాజ సంక్షేమానికి ఎంతో దోహదపడుతున్నారన్నారు. సదానంద గుప్తా మాట్లాడుతూ.. జీవితాంతం సమాజ సేవాకే అంకితమవుతానన్నారు. ప్రజా సేవా చేస్తూ జీవితం గడుపుతానన్నారు.

అంబేడ్కర్ ఆశయాలను సాధించాలి

మహనీయుల విగ్రహాల శుద్ధికరణ



అంబేడ్కర్ విగ్రహాన్ని శుభ్రం చేస్తున్న కార్పొరేటర్ రాధా ధీరజ్‌రెడ్డి

దిల్‌సుఖ్‌నగర్: బీఆర్ అంబేడ్కర్ ఆశయాలను సాధించాలని ఆర్‌కేపురం డివిజన్ కార్పొరేటర్ రాధా ధీరజ్‌రెడ్డి, రంగారెడ్డి జిల్లా బీజేపీ ప్రధాన కార్యదర్శి పిట్టా ఉపేందర్ రెడ్డి పేర్కొన్నారు.అంబేడ్కర్ జయంతిని పురస్కరించుకుని ఆదివారం మహేశ్వరం నియోకవర్గం ఆర్‌కేపురం డివిజన్ ఎన్టీఆర్‌నగర్‌లోని అంబేడ్కర్ విగ్రహాన్ని శుద్ధి చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. భారత రాజ్యాంగ నిర్మాత అంబేడ్కర్ చూపిన బాటలో అందరూ నడవాలన్నారు. ఈ కార్యక్రమంలో రాములు యాదవ్, సంతోష్, వెంకట్ రెడ్డి, సతీష్, కరుణ, కుసుమ, షకీరా, శ్రీను, శేఖర్ రెడ్డి, మహేష్, రమేష్ గౌడ్ ల్గొన్నారు.



అంబేడ్కర్ విగ్రహాన్ని శుద్ధి చేస్తున్న బీజేపీ నాయకులు

మూసారంబాగ్‌లో..

మలక్‌పేట: మూసారాంబాగ్ చౌరస్తాలో బీజేపీ ఎస్సీ మోర్చా ఆధ్వర్యంలో అంబేడ్కర్ విగ్రహాన్ని శుద్ధి చేశారు. కార్పొరేటర్ బొక్క భాగ్యలక్ష్మి మధుసూదన్ రెడ్డి అధ్యక్షతన జరిగిన కార్యక్రమానికి ఎస్సీ మోర్చా జాతీయ నాయకుడు కుమార్, రాష్ట్ర నాయకులు కొప్పు బాషా, బీజేపీ భాగ్యనగర్ జిల్లా అధ్యక్షుడు నిరంజన్ యాదవ్ హాజరై అంబేడ్కర్ విగ్రహాన్ని శుద్ధి చేశారు. ఈ కార్యక్రమంలో సైదాబాద్ కార్పొరేటర్ అరుణ రవీందర్ రెడ్డి, సందడి సురేందర్ రెడ్డి, దేవేందర్, రాజేష్, నరసింహ, జక్క మోహన్ రెడ్డి, గజానంద్, సురేందర్, వినోద్, ప్రవీణ్, రామచందర్ పాల్గొన్నారు.

ఎల్‌బీనగర్‌లో

మన్సూరాబాద్: బీఆర్ అంబేడ్కర్ జయంతిని పురస్కరించుకుని ఎల్‌బీనగర్‌లోని అంబేడ్కర్, బాబూ జగ్జీవన్‌రామ్ విగ్రహాలను మన్సూరాబాద్ కార్పొరేటర్ కొప్పుల నర్సింహారెడ్డి ఆధ్వర్యంలో శుద్ధి చేశారు. ఈ కార్యక్రమానికి బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి రాణిరుద్రమ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. అంబేడ్కర్ జయంతిని ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి, నాయకులు బండారి భాస్కర్, మునగాల హరీష్‌రెడ్డి, గుండె కిరణ్‌కుమార్, ఎంజాల జగన్, నరేష్‌యాదవ్, సిద్ధు పాల్గొన్నారు.

